సాక్షి
మంచిర్యాల
గురువారం । 6 । ఏప్రిల్ । 2023



ఆశాజనకంగా యాసంగి పత్తి

జిల్లాలో యాసంగిలో పలు ప్రాంతాల్లో సాగు చేసిన పత్తి పంట ఆశాజనకంగా ఉంది. నీటి వసతి ఉన్న చోట సాగు చేయడంతో త్వరలో పంట చేతికి వచ్చే అవకాశం ఉంది. 8లో▸




పూర్తయిన పంటనష్టం సర్వే

జిల్లాలో అకాల వర్షాలతో నష్టపోయిన పంటలపై సర్వే చేపట్టి నివేదికను బుధవారం ప్రభుత్వానికి అందజేశారు. గ్రామాల వారీగా రైతుల పేర్లు, వివరాలు నమోదు చేశారు. 8లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
38.0 /25.0

ఆకాశం ప్రకాశవంతంగా ఉంటుంది. ఎండల తీవ్రత పెరిగే అవకాశం ఉంది. ఈశన్యం దిశగా వడగాలులు వీస్తాయి.



ఇఫ్తార్ గురు : 6:30 | సహర్ శుక్ర: 4:42

రంజాన్ వేళలు

పత్తి విత్తనం.. భారం



పత్తి పంటలో దౌర కొడుతున్న రైతు(ఫైల్)

- పెరిగిన విత్తనాల ప్యాకెట్ ధర
- జిల్లా రైతులపై రూ.1.54 కోట్లు
- ఇప్పటికే ఎరువులు, కూలీ, ఇంధన ధరలు పైపైకి..

మంచిర్యాలఅగ్రికల్చర్: పత్తి పంట సాగు చేసే రైతులకు ఏటేటా పెట్టుబడి పెరుగుతోంది. తాజాగా పత్తి విత్తనాల ప్యాకెట్ల ధర పెరగడంతో ఆందోళన వ్యక్తమవుతోంది. జిల్లాలో 1.80లక్షల ఎకరాల్లో పత్తి సాగుకు రైతులు సిద్ధమయ్యారు. ఎకరానికి రెండు ప్యాకెట్ల చొప్పున 3.60లక్షల ప్యాకెట్లు అవసరం కానున్నాయి. రానున్న వ్యవసాయ సీజన్‌కు పత్తి విత్తనాల ధరలు ఒక్కోప్యాకెట్‌కు రూ.43 వరకు పెంచడానికి కంపెనీలు నిర్ణయించాయి. ఈ లెక్కన జిల్లా రైతులపై 1.54 కోట్ల భారం పడనుంది. ఇప్పటికే అతివృష్టి, అనావృష్టి వాతావరణ పరిస్థితులతో పంటలు నష్టపోతూనే ఉన్నారు. ఎరువులు, క్రిమిసంహారక మందులు, యంత్రాలు, డీజిల్ ధరలు, కూలీ ధరలతో గిట్టుబాటు కావడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మార్కెట్‌లో బీటీ-1, బీటీ-2 రకాలు అందుబాటులో ఉన్నాయి. రైతులు అధిక దిగుబడి కోసం బీటీ-2 విత్తనాలు సాగు చేస్తున్నారు. ప్యాకెట్(450 గ్రాములు) ధర గత ఏడాది రూ.810 ఉండగా ఈ ఏడాది రూ.853గా నిర్ణయిస్తూ కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కాగా, పెద్దయెత్తున సాగు చేస్తున్న రైతులను ఆసరాగా చేసుకుని నకిలీ విత్తనాలు చెలామణి అవుతున్నాయి. సీజన్‌కు ముందే జిల్లాలో పెద్దయెత్తున విత్తనాలు పట్టుబడుతున్నాయి. రానున్న సీజన్ దృష్ట్యా మేలురకం, గుర్తింపుపొందిన కంపెనీల విత్తనాలను మాత్రమే డీలర్ల నుంచి రైతులు కొనుగోలు చేసేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. క్యూఆర్ కోడ్‌లో ఏ కంపెనీ, ఎప్పుడు తయారైంది, లాట్ నంబరు, విత్తన రకం తదితర వివరాలను తెలుసుకునే అవకాశం ఉంది. దీంతో నాసిరకం విత్తనాలతో దిగుబడి రాక నష్టపోతున్న రైతులకు చేరకుండా అడ్డుకట్ట పడుతుంది. నష్టపోయిన రైతులకు పరిహారం అందే అవకాశం ఉంది.

ధరలు తగ్గించాలి



ఇప్పటికే ఎరువులు, డీజిల్, పురుగు మందుల ధరలు పెరిగినయి. ఓ దిక్కు కూలీలు ధరలు పెరిగినయి. ఇప్పుడు పత్తి విత్తన ధరలు పెరిగితే మరింత భారం పడుతుంది. ఏటికేటా పత్తి సాగుకు వేలకు వేలు ఖర్చు పెరిగిపోతోంది. పండిన పంటకు గిట్టుబాటు ధర మాత్రం దక్కడం లేదు. పెంచిన విత్తన ధరలు తగ్గించాలి.

– రామ్‌మేరా, కన్నెపల్లి

రాయితీపై అందించాలి



నాకున్న నాలుగు ఎకరాలతోపాటు మరో ఆరు ఎకరాలు కౌలుకు తీసుకొని పత్తి సాగు చేస్తున్నా. ఒక ఏడాది వర్షాలు లేక, మరో ఏడాది భారీ వర్షాలుతో పంట నష్టపోతున్నాం. పత్తి పంట సాగుకు రూ.35వేల వరకు ఖర్చు చేయాల్సి వస్తోంది. అరకొర దిగుబడి వచ్చిన పంటకు మాత్రం గిట్టుబాటు ధర లభిస్తలేదు. విత్తన ధరలు, ఎరువులు, కూలీలు, ట్రాక్టర్ కిరాయిలు పెరిగిపోతున్నాయి. ప్రభుత్వం రాయితీపై పత్తి విత్తనాలు అందించాలి.

– జాపాతి నారాయణ, నెన్నెల

అధికంగా సాగు

వానాకాలంలో సీజన్‌లో 3.60 లక్షల ఎకరాల్లో వివిధ రకాల పంటలు సాగు అవుతుండగా.. ఇందులో అధికంగా పత్తి విస్తీర్ణం ఉంటుంది. గత ఏడాది 1.60 లక్షల ఎకరాల్లో పత్తి సాగు కాగా ఈ ఏడాది 1.80లక్షల ఎకరాల్లో సాగయ్యే అవకాశం ఉందని వ్యవసాయ అధికారులు అంచనా వేస్తున్నారు. ఎక్కువగా భూములు కౌలుకు తీసుకుని సాగు చేస్తుంటారు. జిల్లాలో నల్లరేగడి నేలలు ఎక్కువగా ఉండడంతో పత్తి సాగుకు అనుకూలంగా మారింది. ఎకరానికి రూ.30 వేల నుంచి రూ.45వేల వరకు పెట్టుబడి పెడుతున్నారు. విత్తనాల కోసం రూ.250 కోట్ల నుంచి రూ.300 కోట్ల వరకు ఖర్చు చేస్తున్నారు. పలు కంపెనీలు వివిధ రకాల విత్తనాలను మార్కెట్లో ప్రవేశపెట్టడంతో విత్తన ధరలపై కేంద్ర ప్రభుత్వం నియంత్రణ విధించింది. ఏటా విత్తన తయారీ తదితర ఖర్చులను లెక్కించి ధరను నిర్ణయిస్తోంది. ఆ ధరల ప్రకారమే విత్తనాలను విక్రయించాల్సి ఉంటుంది. కంపెనీలను బట్టి ధర ఉంటోంది. కొన్ని కంపెనీలు నిర్ణయించిన ధర కంటే ప్రచారం కోసం ధర తగ్గించి కూడా విక్రయాలు సాగిస్తున్నాయి. క్యూఆర్ కోడ్ ఉన్న నాణ్యమైన విత్తనాలు ప్రభుత్వం నిర్ణయించిన ధరకు లోబడి డీలర్లు విక్రయించాల్సి ఉంటుంది. సీజన్ సమయంలో కంన్ని కంపెనీలు విత్తనాలను బ్లాక్‌మార్కెట్‌లో అధిక ధరలకు విక్రయిస్తున్నాయనే ఆరోపణలున్నాయి.

నిషేధించినా విక్రయాలు

జిల్లాలో నిషేధిత విత్తనాలూ విక్రయిస్తున్నారు. కలుపు నియంత్రణ కోసం రైతులు ప్రభుత్వ గుర్తింపు లేని విత్తనం(గ్లైసిల్) బీటీ-3 కొనుగో లు చేస్తున్నారు. ఏటా వందల క్వింటాళ్లలో విత్తనాలు పట్టుబడుతున్నా సరఫరా ఆగడం లేదు. గుర్తింపు పొందిన డీలర్ల వద్ద 70శాతం విత్తనా లు కొనుగోలు చేస్తుండగా.. 30శాతం గుర్తింపు లేని విత్తనంతో రైతులు సాగు చేస్తున్నారనే ఆరో పణలున్నాయి. దీంతో పంట దిగుబడి రాక నష్టపోతున్న రైతులు ఏటికేడు పెరిగిపోతున్నారు. అయినా విత్తన సరఫరా ఆగడం లేదు. గుర్తింపు పొందిన విత్తన ప్యాకెట్ ప్రభుత్వం నిర్ణయించిన ధర రూ.850కు లభిస్తుండగా, గుర్తింపు లేని విత్త నం రూ.1000 నుంచి రూ.1500 వరకు లభిస్తుంది. కలుపు, కూలీల కొరత, అధిక ఖర్చును అధిగమించేందుకు నిషేధిత విత్తనం ధర ఎక్కువైనా కొనుగోలు చేస్తున్నారు. గుర్తింపు పొందిన విత్తనాల ధరలు పెరగడంతో నిషేధిత విత్తనాల ధరలు భారీగా పెరిగినట్లు తెలుస్తోంది.

జగ్జీవన్‌రామ్ ఆశయసాధనకు కృషి చేయాలి



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్

మంచిర్యాలఅగ్రికల్చర్: దేశంలో సమానత్వం కోసం పోరాడి, సమాజ హితం కోసం తన జీవితాన్ని అంకితం చేసిన మహోన్నత వ్యక్తి డాక్టర్ బాబు జగ్జీవన్‌రామ్ అని, ఆయన ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ అన్నారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జగ్జీవన్‌రామ్ 116 జయంతి వేడుకలు నిర్వహించారు. కలెక్టర్ సంతోష్, ట్రెయినీ కలెక్టర్ పి.గౌతమి, మంచిర్యాల ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్ రావు, ఆర్డీవో వేణు, షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఉప సంచాలకులు రవీందర్‌రెడ్డిలు జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బాబు జగ్జీవన్‌రామ్ స్వాతంత్ర్య ఉద్యమంలో తనవంతు పాత్ర పోషించారని తెలిపారు. సామాజిక సమానత్వం, అణగారిన వర్గాల హక్కుల కోసం అలుపెరుగని పోరాటం సాగించారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పెంట రాజయ్య, ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు జిల్లపెల్లి వెంకటేష్, ఎంఆర్‌పీఎస్ గొడిసెల దశరథం, నాయకులు సీహెచ్.రాజమల్లు, జెట్టి చరణ్, సుధీర్, అంజయ్య, లింగయ్య పాల్గొన్నారు.

జగ్జీవన్‌రామ్ జయంతి



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే చిన్నయ్య, నారదాసు

వేమనపల్లి: మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం బాబు జగ్జీవన్‌రావు జయంతి వేడుకల్లో ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య, మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్‌రావు పాల్గొన్నారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ తొంగల సత్యనారాయణ, ఎంపీపీ కోలి స్వర్ణలత, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు కోలి వేణుమాధవ్, వైస్ ఎంపీపీ ఆత్రం గణపతి, ఎంపీటీసీలు దాగం బాపు, చంద్రకళ, కో ఆప్షన్ సభ్యుడు జాహెద్‌అలీ, ఎంపీడీఓ లక్ష్మయ్య, సీనియర్ అసిస్టెంట్ లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

విద్యార్థుల ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలి



వంటలను పరిశీలిస్తున్న కలెక్టర్ సంతోష్

మంచిర్యాలఅగ్రికల్చర్: విద్యార్థుల ఆరోగ్యంపై వసతిగృహ అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని సున్నంబట్టివాడ, సాయికుంటలో జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ సమీకృత బాలుర వసతిగృహాన్ని ట్రెయినీ కలెక్టర్ పి.గౌతమితో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాల, వసతిగృహ అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, సమయానికి మెనూ ప్రకారం భోజనం అందించాలని తెలిపారు. వసతిగృహంలోని గదులు, మూత్రశాలలు, పరిసరాలు పరిశుభ్రంగా ఉండే విధంగా పారిశుద్ధ్యం నిర్వహణ ఉండాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వసతిగృహ అధికారులు, అధికారులు పాల్గొన్నారు.

సీపీఎస్ రద్దయ్యే వరకు పోరాటం



మాట్లాడుతున్న కమలాకర్

దండేపల్లి: రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయుల సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానం అమలయ్యే వరకు పోరాటం కొనసాగిస్తామని సీపీఎస్ ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దాముక కమలాకర్ తెలిపారు. మండలంలోని తాళ్లపేటలో బుధవారం సంఘ నాయకులతో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీపీఎస్ విధానంతో ఉద్యోగ, ఉపాధ్యాయులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిని వెంటనే రద్దు చేసి, పాత పెన్షన్ విధానం అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఒక్కసారి ఎన్నికయ్యే ఎంపీ, ఎమ్మెల్యేలు జీవితాంతం పింఛన్ పొందుతున్నారని, సీపీఎస్ ఉద్యోగులు పింఛన్ పొందలేకపోతున్నారని తెలిపారు. సమావేశంలో సంఘం రాష్ట్ర సహా అధ్యక్షుడు శంకర్, ఎస్సీ, ఎస్టీ టీఎస్ జిల్లా అధ్యక్షుడు లక్ష్మణరావు, పీఆర్టీయూ నాయకుడు రాజయ్య పాల్గొన్నారు.


సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మకు ఉరి



కేసీఆర్ దిష్టిబొమ్మకు ఉరి వేస్తున్న సభ్యులు

మంచిర్యాలటౌన్: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ అరెస్టును నిరసిస్తూ ఆ పార్టీ బీసీ యువ మోర్చా ఆధ్వర్యంలో బుధవారం ఐబీ చౌరస్తాలోని స్తంభానికి సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మకు ఉరివేసి నిరసన వ్యక్తం చేశారు. ఆకుల అశోక్‌వర్ధన్, ముదాం మల్లేశ్, సత్యనారాయణ, తన్నీరు కృష్ణ, శరత్ పాల్గొన్నారు.

ఆరంభించినా అవస్థలే!



రాజీవ్ రహదారిపై ఉన్న ఇందారం బ్రిడ్జి

- మంత్రి చేతుల మీదుగా ఇందారం బ్రిడ్జి ప్రారంభం
- ఇంకా కొనసాగుతున్న రోడ్డు నిర్మాణ పనులు
- గత మూడేళ్లుగా నరకం చూస్తున్న ప్రయాణికులు

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: రాజీవ్ రహదారిపై జిల్లాను కలిపేందుకు ప్రధాన మార్గంగా ఉన్న ఇందారం బ్రిడ్జి కష్టాలు తీరడం లేదు. మూడున్నరేళ్లుగా ఈ వంతెన పనులు కొనసాగుతూనే ఉన్నాయి. విచిత్రంగా మంత్రి హరీశ్‌రావు చేతుల మీదుగా అట్టహాసంగా ప్రారంభించి కూడా ఇంకా అందుబాటులోకి రాకపోవడం గమనార్హం. సింగరేణికి చెందిన రూ.37.50కోట్లతో బ్రిడ్జి నిర్మాణం చేపట్టగా.. గత మూడేళ్లుగా పనులు నడుస్తూనే ఉన్నాయి. కొన్నాళ్లపాటు భూసేకరణతో పూర్తిగా పనులు నిలిచిపోగా ఇటీవల మళ్లీ మొదలయ్యాయి. ప్రధాన వంతెన నిర్మాణం పూర్తి కాగా, రెండు వైపు ఇంకా రోడ్డు వేయాల్సి ఉంది. ఇవి పూర్తి కాకుండానే గత నెల 15న ఆర్థికశాఖ మంత్రి హరీశ్‌రావు చేతుల మీదుగా స్థానిక ఎమ్మెల్యే బాల్క సుమన్ సమక్షంలో వంతెనను ప్రారంభించారు. కానీ నేటికీ వాహనదారులకు తిప్పలు తప్పడం లేదు.

సింగరేణి నిధులతో..

రాజీవ్ రహదారిపై నిర్మిస్తున్న ఈ బ్రిడ్జి పనుల పర్యవేక్షణ కోసం ప్రత్యేక విభాగం ఉంది. రాష్ట్ర స్థాయిలోనే సీఈ ఉంటారు. అక్కడి నుంచే రాష్ట్రంలో నిర్మిస్తున్న ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంతో చేపట్టిన రోడ్లు, వంతెన నిర్మాణాలు పర్యవేక్షిస్తుంటారు. ఇందారం ఓపెన్‌కాస్టులో తీసే ఓబీ(మట్టి)ని శ్రీరాంపూర్ ఓపెన్‌కాస్టు రోడ్డు ఇవతలి వైపు ఉన్న ఖాళీ స్థలంలో డంప్ చేసేందుకు వీలుగా ఈ బ్రిడ్జిని నిర్మిస్తున్నారు. సింగరేణి తన అవసరాల కోసం ఈ బ్రిడ్జి చేపట్టడంతో ఆ సంస్థే పూర్తిగా నిధులు సమకూర్చింది. మొదటి నుంచి నిర్మాణ పనులకు నిధుల కొరత లేదు. ఏడాదిలోపు పూర్తి కావాల్సిన ఈ వంతెన మూడేళ్లు దాటినా వాహనదారులకు తిప్పలు తప్పడం లేదు. కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో రాత్రివేళ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. రెండేళ్లలో బ్రిడ్జి సమీపంలోనే ముగ్గురు చనిపోయారు. నలుగురు గాయపడ్డారు. వంతెనకు అటు, ఇటు వైపు ప్రమాదకరంగా మలుపుతో భారీ వాహనాలు వచ్చేటప్పుడు ప్రమాదాలకు ఆస్కారం ఏర్పడుతోంది. జిల్లాతోపాటు ఆసిఫాబాద్, కాగజ్‌నగర్, మహారాష్ట్ర, ఉత్తర భారత దేశానికి వెళ్లే వాహనాలకు ఇదే ప్రధాన రహదారి. దీంతో భారీ గూడ్స్ వాహనాలతో ట్రాఫిక్‌తో ఇబ్బంది పడుతున్నారు.

గుంతల రోడ్డు, దుమ్ములో ప్రయాణం

దాదాపు కిలోమీటరు కూడా దూరం ఉండని ఈ వంతెన ఆలస్యంతో వాహనదారులు నిత్యం నరకం అనుభవిస్తున్నారు. గుంతలతో కూడిన రోడ్డుపై, దుమ్ము ధూళిలో రాకపోకలు సాగిస్తున్నారు. ఈ ప్రాంతంలో ప్రయాణం కోసం 20నిమిషాలు సమయం పడుతోంది. ఇక్కడే అటవీ శాఖ చెక్‌పోస్టు ఉండడంతో రోడ్డుపై కర్ర లోడ్లతో వెళ్లే వాహనాలు నిలిచిపోవడంతోనూ ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోంది. ఇక రోజువారీగా గని కార్మికులు, జైపూర్ థర్మల్ ప్లాంట్‌లో పని చేసేవాళ్లు, గోదావరిఖని, మంచిర్యాల, శ్రీరాంపూర్, నస్పూర్ తదితర ప్రాంతాలకు ప్రయాణించే వారికి అవస్థలు పడుతున్నారు. గతుకుల రోడ్లపై రాకపోకలు సాగించడంతో వాహనాలు దెబ్బతింటున్నాయని వాపోతున్నారు.

రాష్ట్ర సంపదను దోచిపెడుతున్న కేసీఆర్



ఇందారం పాదయాత్రలో మల్లు భట్టి విక్రమార్క, డీసీసీ అధ్యక్షురాలు సురేఖ, నాయకులు

- సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క
- ఇందారం ఓపెన్‌కాస్టు గని సందర్శన

జైపూర్: దేశంలో మోదీ, రాష్ట్రంలో కేసీఆర్ ప్రజలకు చెందాల్సిన సంపదను కొద్దిమంది బడా వ్యక్తులకు అక్రమంగా దోచిపెడుతున్నారని సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో చేపట్టిన పీపుల్స్‌మార్చ్ పాదయాత్ర 21వ రోజు బుధవారం మండలంలోని టేకుమట్ల గ్రామం నుంచి ఇందారం మీదుగా సాగింది. పెరిగిన ధరలు, ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రజలు ఆయనకు విన్నవించారు. పీసీసీ మాజీ అధ్యక్షుడు వి.హనుమంతరావు, పీసీసీ ఉపాధ్యక్షుడు గాలి అనిల్‌కుమార్ పాదయాత్రలో పాల్గొని 'భట్టి'కి మద్దతు తెలిపారు. దొరగారిపల్లి నుంచి ఇందారం ఓపెన్‌కాస్టు వరకు పాదయాత్ర చేసిన విక్రమార్క ఐకే-ఓసీపీ సందర్శించి కార్మికుల సమస్యలు తెలుసుకున్నారు. చాలీచాలని వేతనాలతో కాలం వెళ్లదీస్తున్నామని కార్మికులు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం ఇందారం మసీదులో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో పాల్గొని ఉపవాస దీక్ష చేస్తున్న ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు. రాత్రి శివాలయం వద్ద నిర్వహించిన కార్నర్ మీటింగ్‌లో ప్రజలను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. ప్రజాసమస్యలను గాలికొదిలేసిన ప్రభుత్వాలు కేవలం కొంతమందికి లబ్ధి చేకూర్చేవిధంగా వ్యవహరించడం చాలా బాధారమని అన్నారు. ప్రభుత్వరంగ స్థలలను ప్రైవేట్ పరం చేస్తూ లక్షల్లో ఉన్న ఉద్యోగుల సంఖ్యను రెట్టింపు చేయాల్సిపోయింది దాన్ని వేలల్లోకి తీసుకురావడం వారి పరిపాలనకు నిదర్శనమని విమర్శించారు. ప్రజాస్వామ్యాన్ని రక్షించాలని, దేశ సంపదను ప్రజలకు పంచాలని రాహుల్‌గాంధీ పోరాటం చేస్తుండగా.. దోపిడీదారులను రక్షిస్తూ ప్రశ్నించినవారిపై కేసులు పెడుతున్నారని తెలిపారు. సింగరేణి సంపద, సింగరేణి ఆస్తి ప్రజలదని, కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రజలపైనే ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ, పీసీసీ సభ్యులు నూకల రమేశ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఎండీ.ఫయాజోద్దీన్, జిల్లా ప్రధానకార్యదర్శి రిక్కుల శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని అస్థిరపరుస్తారా..?

- మంచిర్యాల ఎమ్మెల్యే దివాకర్‌రావు
- బండి సంజయ్ దిష్టిబొమ్మ దహనం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు

మంచిర్యాలటౌన్: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని అస్థిరపరిచి, అప్రతిష్టపాలు చేసేందుకు కుట్రపన్నుతున్నారని, అందులో భాగంగానే పదో తరగతి ప్రశ్నపత్రాలను లీక్ చేశారని మంచిర్యాల ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు విమర్శించారు. జిల్లా కేంద్రంలోని ఆయన నివాసంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బండి సంజయ్‌ను వెంటనే బర్తరఫ్ చేసి, ఎంపీ పదవికి అనర్హుడిగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. పదో తరగతి పరీక్ష ప్రశ్నపత్రం లీకేజీ విషయంలో ప్రముఖ పాత్ర బండి సంజయ్ అనుచరుడు ప్రశాంత్‌దేనని పోలీసులు గుర్తించారని అన్నారు. ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకతను పెంచాలని, పేపర్ లీకేజీతో విద్యార్థులను అయోమయానికి గురి చేసి వారిలో అలజడి సృష్టించేందుకు ప్రయత్నిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రానున్న ఎన్నికల్లో ప్రజలు, విద్యార్థులు, నిరుద్యోగులు బీజేపీకి తగిన బుద్ధిచెప్పాలని పిలుపునిచ్చారు. అనంతరం ఐబీ చౌరస్తాలో బండి సంజయ్ దిష్టిబొమ్మను పార్టీ శ్రేణులు దహనం చేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పెంట రాజయ్య, నస్పూర్ మున్సిపల్ చైర్మన్ ఈసంపల్లి ప్రభాకర్, నడిపెల్లి విజిత్‌రావు, నాయకులు పాల్గొన్నారు.

ఇంత నీచపు రాజకీయమా?


- బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య



మాట్లాడుతున్న ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య

వేమనపల్లి: ప్రజల్లో గుర్తింపు లేని ప్రతిపక్షాలు నీచపు రాజకీయాలకు పాల్పడుతున్నాయని బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య ఆగ్రహం వ్యక్తం చేశారు. వేమనపల్లి మండల కేంద్రంలో బుధవారం నిర్వహించిన బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనంలో బీఆర్ఎస్ పార్టీ జిల్లా పరిశీలకులు, మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్‌రావుతో కలిసి మాట్లాడారు. అభివృద్ధే లక్ష్యంగా పని చేస్తున్న తనను ఎదుర్కోలేక మహిళలను అడ్డం పెట్టుకొని నీచపు రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు. రాష్ట్రంలో దళిత, గిరిజన ఎమ్మెల్యేలను అణగదొక్కేందుకు బీజేపీ, కాంగ్రెస్ నీతిమాలిన ఆరోపణలు చేస్తున్నాయని ఆరోపించారు. నిజాలు ఆలస్యంగానైనా బయటకు వస్తాయని, ఆధారాలతో సహా ప్రజాక్షేత్రంలో బయట పెడతానని చెప్పారు. పేపర్ల లీకేజీలో బీజేపీ హస్తం ఉందని, బండి సంజయ్, సన్నిహితులకు పదో తరగతి, టీఎస్‌పీఎస్సీ పేపర్ల లీకేజీతో సంబంధం ఉందని, సంజయ్ అరెస్ట్‌తో నిరూపితమవుతోందని తెలిపారు. ఈ సమావేశంలో జెడ్పీ వైస్ చైర్మన్ తొంగల సత్యనారాయణ, ఎంపీపీ కోలి స్వర్ణలత, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు కోలి వేణుమాధవ్, ఏఎంసీ వైస్ చైర్మన్ లింగాగౌడ్, సింగిల్‌విండో చైర్మన్ కిషన్‌రావు, వైస్ ఎంపీపీ గణపతి, రైతు సంఘం మండల అధ్యక్షుడు భీమయ్య, సీనియర్ నాయకులు పురాణం లక్ష్మీకాంత్ పాల్గొన్నారు.

'నిరంకుశ పాలనకు నిదర్శనం'



రఘునాథ్‌ను అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు

మంచిర్యాలటౌన్: పదవ తరగతి పేపర్ లీకేజీ ఘటనపై ప్రశ్నిస్తే అక్రమంగా అరెస్టులు చేయడం కేసీఆర్ నిరంకుశ పాలనకు నిదర్శనమని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ వెరబెల్లి విమర్శించారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్‌ను పోలీసులు అరెస్టు చేయడాన్ని నిరసిస్తూ ఆందోళనలు చేపట్టకుండా జిల్లా కేంద్రంలో బుధవారం పోలీసులు బీజేపీ జిల్లా అధ్యక్షుడితోపాటు నాయకులను ముందస్తుగా అరెస్టు చేశారు. హనుమాన్ దీక్షలో ఉన్న రఘునాథ్ హమాలీవాడ ఆలయంలో పూజ చేసి బయటకు వస్తుండగా అదుపులోకి తీసుకున్నారు. దీంతో పోలీసులు, బీజేపీ నాయకులకు మధ్య తోపులాట జరిగింది. కార్యకర్తలు అశోక్, చక్రి అస్వస్థతకు గురికాగా పట్టణంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అనంతరం బీజేపీ జిల్లా అధ్యక్షుడు మాట్లాడుతూ టీఎస్‌పీఎస్సీ, పదో తరగతి పరీక్ష ప్రశ్నపత్రాలు లీకేజీ ఘటనపై ప్రశ్నిస్తే అక్రమంగా అరెస్టు చేయిస్తున్నారని అన్నారు. కవిత లిక్కర్ స్కాం, కేటీఆర్ టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీని ప్రశ్నించవద్దా అని, పేపర్ లీకేజీతో విద్యార్థులు, నిరుద్యోగుల జీవితాలతో రాష్ట్ర ప్రభుత్వం చెలగాటమాడుతోందని విమర్శించారు. పార్టీ పట్టణ అధ్యక్షుడు వంగపల్లి వెంకటేశ్వర్‌రావు, బోయిని హరికృష్ణ, ఆకుల సంతోష్, రెడ్డిమల్ల అశోక్, కుర్రె చక్రి, అమిరిశెట్టి రాజు, రాకేశ్ రెన్వా, సాతిని రాజు, పూదరి రమేశ్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

కుక్కల దాడిలో చుక్కల దుప్పి మృతి



మృతిచెందిన చుక్కల దుప్పి

నెన్నెల: మండలంలోని జెండావెంకటపూర్ గ్రామశివారులో బుధవారం వీధి కుక్కల దాడిలో చుక్కల దుప్పి మృతి చెందింది. అడవిలో నుంచి జనవాసాల్లోకి వచ్చిన దుప్పిని గమనించిన కుక్కల గుంపు దాడి చేసి తీవ్రంగా గాయపరిచాయి. గ్రామస్తులు కుక్కలను చెదరగొట్టి అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. వెంటనే నార్వాయిపేట సెక్షన్ అధికారి ఏల్పుల శ్రీనివాస్ సంఘటనా స్థలానికి చేరుకుని దుప్పిని రక్షించే ప్రయత్నం చేశారు. పరిస్థితి విషమించి దుప్పి మృతిచెందింది. దుప్పి కళేబరాన్ని పోస్టుమార్టం నిమిత్తం నెన్నెల పశువైద్యశాలకు తరలించారు. బెల్లంపల్లి రేంజ్ కాంప్లెక్స్ ప్రాంతంలో దుప్పి కళేబరాన్ని దహనం చేశారు.

రేషన్ బియ్యం పట్టివేత



పట్టుకున్న రేషన్ బియ్యంతో అధికారులు

మంచిర్యాలటౌన్: జిల్లా కేంద్రంలో బుధవారం రెవెన్యూ అధికారులు రేషన్ బియ్యం పట్టుకున్నారు. రేషన్ షాపు నుంచి తీసుకున్న 1.50 క్వింటాళ్ల బియ్యంను అక్రమంగా తరలిస్తుండగా డెప్యూటీ తహసీల్దార్ కమల్‌సింగ్, సీనియర్ అసిస్టెంట్ శ్రీహరి పట్టుకుని స్వాధీనం చేసుకున్నారు. ఈ నెలలోనే బలవర్ధకమైన బియ్యం లబ్ధిదారులకు ప్రభుత్వం పంపిణీ చేస్తున్నప్పటికీ ఆ బియ్యాన్ని సైతం అమ్ముకుంటున్నారు.

108 అంబులెన్స్ తనిఖీ



తనిఖీ చేస్తున్న ప్రోగ్రాం మేనేజర్

జన్నారం: జన్నారం మండల 108 అంబులెన్స్‌తోపాటు బైక్ అంబులెన్స్‌ను అంబులెన్స్ జిల్లా ప్రోగ్రాం మేనేజర్ సామ్రాట్ బుధవారం ఆకస్మిక తనిఖీ చేశారు. వాహనాల్లోని పరికరాలతోపాటు సామర్థ్యం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 108 అంబులెన్స్ సేవలను అత్యవసరానికి వినియోగించుకోవాలని తెలిపారు. ఈఎంఈ కొండల్‌రావ్, ఫ్లేస్ కోఆర్డినేటర్ జనార్దన్, ఈఎంటీలు కిషన్, రవి, ఫైలెట్ రఫీక్ పాల్గొన్నారు.

పాల కేంద్రం ప్రారంభించండి



మూసివేసిన చెన్నూర్ పాలశీతల కేంద్రం(ఫైల్)

చెన్నూర్ వ్యవసాయ ఆధారిత ప్రాంతం. ఇక్కడ పాడి రైతులు ఎక్కువే. వ్యవసాయంపై ఆదాయం నామమాత్రమే కావడంతో పాలతో కొంత ఉపాధి పొందుతున్న పాడి రైతుకు ఇక్కడి పాలకేంద్రం మూసివేయడంతో ఉన్న కాస్తా ఉపాధి కరువైంది. దీంతో పాల విక్రయానికి పడరాని పాట్లు పడాల్సిన దుస్థితి. ఇకనైనా అధికారులు, పాలకులు పట్టించుకుని స్థానికంగా మూసివేసిన పాల శీతల కేంద్రాన్ని తిరిగి ప్రారంభించి ఉపాధి కల్పించాలని పాడిరైతులు కోరుతున్నారు.

- చెన్నూర్‌లో 2013లో పాల డెయిరీ మూసివేత
- ఇంటింటికీ వెళ్లి పాలు అమ్ముకుంటున్న పాడి రైతులు
- చెన్నూర్‌తో పాటు నాలుగు మండలాల్లో 2వేల మంది..
- పాలశీతల కేంద్రాన్ని పునఃప్రారంభించాలని వేడుకోలు

చెన్నూర్: ఒకప్పుడు జిల్లాలోనే చెన్నూర్ పాలశీతల కేంద్రం రైతులతో కళకళలాడేది. పాలశీతల కేంద్రాల్లో పాలు విక్రయించడంతో వందలాది మంది రైతులకు ఉపాధి లభించేది. అధికారుల నిర్లక్ష్యం, అప్పటి ప్రభుత్వ పట్టింపులేని తనంతో రైతుల పాలిట శాపంగా మారింది. లాభాల బాటలో నడుస్తున్న పాలశీతల కేంద్రాన్ని అర్ధంతరంగా మూసివేశారు. కేంద్రం మూతపడి భవనం శిథిలావస్థకు చేరడంతో ఆ స్థలాన్ని కేసీఆర్ పార్క్‌గా ఏర్పాటు చేశారు. దీంతో పాలు కొనుగోలు చేసేవారు లేక ఇంటింటికీ వెళ్లి రైతులే విక్రయించుకుంటున్నారు. ప్రస్తుతం చెన్నూర్, వేమనపల్లి, భీమారం నాలుగు మండలాల్లో 2వేల మంది పాడి రైతులున్నారు. కొందరు పాలను హోటళ్లు, ఇళ్లల్లో విక్రయిస్తుండగా మరికొందరు పాలు విక్రయాలు లేక నష్టాల పాలవుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం పాడి పరిశ్రమను అభివృద్ధి చేసి పాడి రైతులను ఆదుకునేందుకు ఓ వైపు ఎన్నో పథకాలు ప్రవేశపెడుతున్నప్పటికీ అవి పూర్తిస్థాయిలో దరిచేరడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. పాడి అభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని మూసివేసిన పాల డెయిరీని పునః ప్రారంభించాలని పాడిరైతులు కోరుతున్నారు.

చెన్నూర్‌లో...

చెన్నూర్‌లో 2003లో అప్పటి ప్రభుత్వం పాలశీతల కేంద్రాన్ని ప్రారంభించింది. ఈ కేంద్రంలో మేనేజర్ తో పాటు మరో 10 మంది సిబ్బంది పనిచేసేవారు. రోజుకు సుమారు 3వేల నుంచి 4వేల లీటర్ల పాలను సుమారుగా 800 మంది వరకు రైతులు విక్రయించేవారు. పాల శీతల కేంద్ర పరిధిలోని మండలాల్లోని గ్రామాలకు వెళ్లి ఆటోల ద్వారా పాలను సేకరించి నిజామాబాద్‌లోని ఏపీ డెయిరీకి తరలించేవారు. 2003 నుంచి 2008 వరకు పాలశీతల కేంద్రం లాభాల బాటలో పయణించింది. రైతులకు సకాలంలో డబ్బులు చెల్లించడంతో పాడి రైతులు అభివృద్ధి దిశగా పయనించారు. తరువాత పాలశీతల కేంద్ర మేనేజర్ డబ్బులు సక్రమంగా చెల్లించకపోవడంతో క్రమంగా రైతులు కేంద్రానికి పాలను విక్రయించడం మానేశారు. కేంద్రానికి పాలు సక్రమంగా రాకపోవడంతో పాటు కేంద్రాల నిర్వహణ భారంగా మారడం, సిబ్బంది వేతనాలు చెల్లించకపోవడం, నష్టాల సాకు చూపుతూ అధికారులు చెన్నూర్ డెయిరీని 2013లో మూసివేశారు. దీంతో చెన్నూర్, కోటపల్లి, భీమారం గ్రామాలకు చెందిన రైతులు కొందరు నెయ్యి తయారు చేసి పట్టణ ప్రాంతాల్లో విక్రయిస్తున్నారు. ఇకనైనా అధికారులు, పాలకులు స్పందించి పాల డెయిరీ ఏర్పాటు చేయాలని పాడి రైతులు వేడుకుంటున్నారు.

భవనాన్ని కేటాయిస్తే.. బీఎంసీ ఏర్పాటు చేస్తాం

చెన్నూర్‌లో పాల డెయిరీ మూసివేసిన విషయం తెలిసింది. అక్కడి మిషన్లు చెడిపోతుండడంతో లక్సెట్టిపేటకు తరలించాం. ప్రస్తుతానికి భవనం లేదు. అధికారులు భవనం ఇచ్చి విద్యుత్‌తో పాటు నీటి సౌకర్యం కల్పిస్తే ప్రస్తుతం వెయ్యి లీటర్ల పాల కొనుగోలు బీఎంసీ (బల్క్ మిల్క్ సెంటర్) పక్షం రోజుల్లో ఏర్పాటు చేస్తాం. పాల ఉత్పత్తి పెరిగితే 3వేల లీటర్ల సామర్థ్యం గల మిషన్లు ఏర్పాటు చేస్తాం.

– మధుసూదన్‌రావు, పాల డెయిరీ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా డీడీ

పాలశీతల కేంద్రం ఏర్పాటు చేయాలి



చెన్నూర్‌లో పాలశీతల కేంద్రం ఏర్పాటు చేయాలి. పాల డెయిరీ లేక తిప్పలు పడుతున్నాం. అధికారులు స్పందించి కేంద్రం ఏర్పాటు చేస్తే స్థానిక రైతులకు ఎంతో మేలు జరుగనుంది.

–శకుంతల కొత్తపల్లి రాజారాం, కోటపల్లి

ఆటో చోరీ.. పట్టుకున్న డ్రైవర్లు

కాగజ్‌నగర్‌టౌన్: స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సమీపంలో పార్కింగ్ చేసిన ఆటోను బుధవారం గుర్తు తెలియని వ్యక్తి చోరీ చేసిన సంఘటన వెలుగులోకి వచ్చింది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. దహెగాం మండలం కర్జెల్లి నివాసి లచ్చన్న తన ఆటోను ఎస్‌బీఐ వద్ద పార్కింగ్ చేసి సెల్ ఫోన్ కొనుగోలు చేసి వచ్చే సరికి ఆటో చోరీకి గురైంది. బాధితుడు పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఆ ఆటోను పర్ధాన్‌గూడ గ్రామానికి చెందిన వెంకటేష్ అపహరించి బస్టాండ్ మీదుగా వెళ్తుండగా ఆటో డ్రైవర్లు చాకచక్యంగా పట్టుకొని నిందితుడితో పాటు ఆటోను పోలీసులకు అప్పగించారు.



ఆటోను పట్టుకున్న డ్రైవర్లు

ఓబీ లక్ష్యాలు సాధించాలి

శ్రీరాంపూర్: ఓసీపీల్లో ఓవర్ బర్డెన్ మట్టి(ఓబీ) వెలికితీత లక్ష్యాలను సాధించాలని కంపెనీ డైరెక్టర్లు తెలిపారు. బుధవారం డైరెక్టర్(ఆపరేషన్స్), డైరెక్టర్ (పీపీ) జీ.వెంకటేశ్వర్‌రెడ్డి వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏరియా జీఎం బీ.సంజీవరెడ్డి శ్రీరాంపూర్ ఓసీపీ, ఇందారం ఓసీపీలో ఓబీ లక్ష్యాలపై డైరెక్టర్లకు వివరించారు. నిర్దేశించిన ఓబీ తీసినప్పుడే బొగ్గు వెలికితీసుకొనే అవకాశం ఉంటుందని, ఓబీ తీయడంలో జాప్యం చేయవద్దని డైరెక్టర్లు సూచించారు. ఈ కార్యక్రమంలో శ్రీరాంపూర్ ఓసీపీ అధికారి పురుషోత్తంరెడ్డి, ఇందారం ఓసీపీ అధికారి ఎం.శ్రీనివాస్ పాల్గొన్నారు.

బావిలో పడి వ్యక్తి మృతి

మందమర్రిరూరల్: మందమర్రి పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఊరు మందమర్రి గ్రామానికి చెందిన కంది తిరుపతి(47) ఇంటి సమీపంలోని బావిలో పడి మృతి చెందాడు. ఎస్సై చంద్రకుమార్ వివరాల ప్రకారం.. మద్యానికి బానిసైన తిరుపతి బుధవారం ఉదయం బావి వద్దకు స్నానం చేయడానికి వెళ్లాడు. బావిలో నీళ్లు తోడే క్రమంలో ప్రమాదవశాత్తు బావిలో పడి మృతిచెందాడు. తండ్రి పులయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపాడు.

జీఆర్‌ఎస్ క్యాంపు వద్ద ఉద్రిక్తత

- ఫర్నిచర్ ధ్వంసం, సిబ్బందిపై దాడి

రెబ్బెన(ఆసిఫాబాద్): స్థానికులకే ఓబీ కంపెనీలో ఉద్యోగాలు కల్పించాలని బెల్లంపల్లి ఏరియాలోని భూనిర్వాసిత ప్రాంతాల నుంచి యువకులు, మహిళలు మంగళవారం పెద్ద ఎత్తున కైరిగూడ ఓసీపీలో ఓబీ పనులు చేపడుతున్న కాంట్రాక్టు సంస్థ జీఆర్‌ఎస్ క్యాంపునకు చేరుకోవడంతో ఉద్రిక్తత వాతావరణం చోటుచేసుకుంది. ఓబీ కంపెనీలో స్థానికులకే ఉపాధి అవకాశం కల్పించాలని గత కొన్ని రోజులుగా చేపడుతున్న ఆందోళన తారా స్థాయికి చేరుకుంది. సింగరేణి ఓసీపీల ఏర్పాటు కోసం భూములు తీసుకుని ఓబీ కంపెనీలో ఉద్యోగాలు కల్పిస్తామని హామీ ఇచ్చి తీరా ఓసీపీలో పనులు ప్రారంభమయ్యాక వివిధ రాష్ట్రాల నుంచి పెద్ద ఎత్తున కార్మికులను తీసుకొచ్చి పనులు కల్పిస్తున్నారని ఆగ్రహించారు. వివిధ రాష్ట్రాల నుంచి తీసుకొచ్చిన కార్మికులను వెంటనే పంపించాలని డిమాండ్ చేస్తూ జీఆర్‌ఎస్ క్యాంపులోకి దూసుకెళ్లడంతో ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. జీఆర్‌ఎస్‌లో పనిచేస్తున్న పలువురు సిబ్బందిపై దాడి చేయడంతో పాటు క్యాంపులోని ఫర్నిచర్‌ను ధ్వంసం చేశారు. విషయం తెలుసుకున్న తిర్యాణి, రెబ్బెన పోలీసులు భారీ బందోబస్తుతో సంఘటనా స్థలానికి చేరుకుని ఆందోళనకారులతో మాట్లాడి క్యాంపు నుంచి బయటకు పంపించారు.



జీఆర్‌ఎస్ క్యాంపు వద్ద భూనిర్వాసితులు

20 మందిపై కేసు నమోదు...

తిర్యాణి: జీఆర్‌ఎస్ క్యాంపుల్లోకి వెళ్లి ఫర్నీచర్ ధ్వంసం చేయడంతో పాటు సిబ్బందిపై భూనిర్వాసితులు దాడికి పాల్పడ్డారు. సిబ్బంది ఫిర్యాదు మేరకు దాడిచేసిన 20మందిని గుర్తించి కేసు నమోదు చేసినట్లు ఎస్సై రమేశ్ తెలిపారు.

బాబూజగ్జీవన్‌రామ్ విగ్రహం ఏర్పాటు చేయాలి

నస్పూర్: హైదరాబాద్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం పక్కన డాక్టర్ బాబూజగ్జీవన్‌రామ్ విగ్రహం ఏర్పాటు చేయాలని మాదిగ హక్కుల దండోరా రాష్ట్ర అధ్యక్షుడు రేగుంట సునీల్‌మాదిగ డిమాండ్ చేశారు. బుధవారం ఆయన నస్పూర్ శ్రీరాంపూర్ ప్రెస్‌క్లబ్ ఆవరణలో బాబు జగ్జీవన్ రామ్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు.

మాదిగ హక్కుల దండోరా జిల్లా కమిటీ ఎన్నిక

మాదిగ హక్కుల దండోరా జిల్లా కమిటీని ఎన్నుకున్నట్లు సునీల్ మాదిగ తెలిపారు. జిల్లా అధ్యక్షుడిగా కడారి రమేశ్(చెన్నూర్), కార్యనిర్వాహక అధ్యక్షులుగా నాతరి కిరణ్ మాదిగ(బెల్లంపల్లి), రామంచ కుమార్‌మాదిగ(మందమర్రి), తగురపు సత్తయ్య మాదిగ(లక్షెట్టిపేట), ఉపాధ్యక్షులుగా తాండ్ర లింగయ్యమాదిగ, అయిల్ల స్వామి మాదిగ, రేణికుంట్ల పోషం మాదిగ, జనంపల్లి బానేష్‌మాదిగ, ప్రధాన కార్యదర్శులుగా చొప్పదండి అరుణ్‌కుమార్, రామగిరి స్వామి మాదిగ, ఆసంపల్లి శ్రీనివాస్ మాదిగ, సప్పిడి నరేశ్ మాదిగ, అధికార ప్రతినిధులు, కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నట్లు తెలిపారు.

రాపల్లిలో 'బలగం' ప్రదర్శన..

మంచిర్యాలరూరల్(హాజీపూర్): గ్రామీణ కుటుంబ భావోద్వేగాలతో పాటు మానవ బంధాలే ముఖ్యం అని చాటి చెప్పిన చిత్రం 'బలగం'..ఈ సినిమా అందరినీ అలరిస్తూ కంటి తడిపెట్టిస్తోంది. పల్లెల్లో ఎల్‌ఈడీలు పెట్టి మరీ గ్రామస్తులకు ఉచితంగా చిత్ర ప్రదర్శన ఇస్తున్నారు. రాపల్లి సర్పంచ్ మల్లేశ్ 'బలగం' సినిమాను గ్రామస్తులు అంతా కలిసి ఒకే చోట వీక్షించాలని భావించి బుధవారం పంచాయతీ ఆవరణలో చిత్ర ప్రదర్శన ఏర్పాటు చేశారు. హాజీపూర్ ఎంపీపీ మందపల్లి స్వర్ణలత వీక్షించారు.



రాపల్లిలో బలగం సినిమా వీక్షిస్తున్న స్థానికులు

ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ కన్వీనర్‌గా ప్రవీణ్‌కుమార్

శ్రీరాంపూర్: సింగరేణి ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్(140/2018) శ్రీరాంపూర్ ఏరియా కన్వీనర్‌గా డేగల ప్రవీణ్‌కుమార్‌ను నియమించారు. మంగళవారం రాత్రి సీసీసీలోని సింగరేణి గెస్టు హౌజ్ కాన్ఫరెన్సు హాల్‌లో డివిజన్ కమిటీ సమావేశం జరిగింది. దీనికి ముఖ్య అతిథులుగా అసోసియేషన్ జనరల్ సెక్రెటరీ ఆంతోటి నాగేశ్వర్‌రావు, డెప్యూటీ జనరల్ సెక్రెటరీ కనుగుంట్ల తిరుపతి, కేంద్ర కమిటీ సభ్యుడు ఇరుగులాల శంకర్‌లు హాజరయ్యారు. వారు శ్రీరాంపూర్ ఏరియా పాత కమిటీని రద్దు చేసి దాని స్థానంలో నూతన కమిటీని నియమించారు. కన్వీనర్‌గా డేగల ప్రవీణ్‌కుమార్ తో పాటు చీఫ్ అడ్వైజర్‌లుగా సంతోశ్‌కుమార్(డీజీఎం), ఈర్ల తిరుపతి(ఎస్ఓఎం), వేము రాధాకృష్ణ (డీవైఎస్ఈ), అడ్వైజర్‌గా పత్తి రామస్వామి, ఏరియా సెక్రెటరీలుగా రెడపాక లక్ష్మణ్, నక్క సుమన్, ట్రెజరర్‌గా గోదారి మురళీ, జాయింట్ సెక్రెటరీలుగా జంగంపల్లి కమల్‌కుమార్, శెట్టి శంకరయ్య, అందె వెంకటేశ్, చీఫ్ ఆర్గనైజింగ్ సెక్రెటరీగా వేల్పుల ప్రవీణ్, ఆర్గనైజింగ్ సెక్రెటరీలుగా కే జోసఫ్, రవిబాబు, ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా కుక్క వాసు, సుందిళ్ల నరేశ్, జనగామ వెంకటేశ్‌లను నియమించారు. నూతన కమిటీకి నియమాక పత్రాలను జీఎం సంజీవరెడ్డి అందజేశారు.



నియామక పత్రం అందుకుంటున్న ప్రవీణ్‌కుమార్

పాముకాటుకు చిన్నారి మృతి

రెబ్బెన(ఆసిఫాబాద్): బుజ్జిబుజ్జి మాటలతో కుటుంబంలో సందడి నింపే ఈ చిన్నారి మాటలు మూగబోయాయి. కుటుంబ సభ్యులతో కలిసి ఆడిపాడి నిద్రకు ఉపక్రమించిన సమయంలో పాముకాటు రూపంలో మృత్యువు కబలించింది. వివరాల్లోకి వెళితే.. మండలంలోని ఇందిరానగర్‌కు చెందిన వడ్లూరి రాజు, సౌజన్య దంపతులకు ముగ్గురు సంతానం. వీరిలో రెండో సంతానమైన హర్షిత (9) 3వ తరగతి చదువుతోంది. తల్లిదండ్రులు కూలీ పనులు చేసుకుంటూ ముగ్గురు పిల్లలను అల్లారుముద్దుగా పెంచుకుంటున్నారు. హర్షిత రోజు మాదిరిగానే మంగళవారం రాత్రి భోజనం చేసి కుటుంబ సభ్యులతో కలిసి నేల మీదే పడుకుంది. రాత్రి కుడి చేతిపై ఏదో కాటు వేయడంతో మంటగా ఉందని తల్లిదండ్రులను నిద్రలేపింది. అప్పటికే చేయి వాపు రాగా నోట మాట మారిపోయింది. హుటాహుటిన కుటుంబ సభ్యులు 108 అంబులెన్స్‌లో ఆసిఫాబాద్‌లోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే హర్షిత మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు.



హర్షిత (ఫైల్)

క్యాడర్ స్కీం పదోన్నతి ఆర్డర్ పత్రాల అందజేత

రెబ్బెన(ఆసిఫాబాద్): బెల్లంపల్లి ఏరియాలోని కైరిగూడ ఓసీపీలో బుధవారం పది మంది క్యాడర్ స్కీం ప్రమోషన్ ఆర్డర్ పత్రాలను జీఎం దేవేందర్ ఉద్యోగులకు అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విధి నిర్వహణలో పదోన్నతులు వ్యక్తి పనిపట్ల మరింత బాధ్యతను పెంచుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏజీఎం తిరుమల్‌రావు, డీజీఎం సివిల్ సతీష్‌బాబు, పీవో ఉమాకాంత్, పీఈ రాజాజీ, మేనేజర్ ప్రవీణ్‌ఫటింగ్, టీబీజీకేఎస్ నాయకులు వెంకటేశం, చంద్రశేఖర్, సీనియర్ పీవో వేణులు పాల్గొన్నారు.

క్లరికల్ ఉద్యోగులకు నియామక పత్రాలు అందచేత..

సింగరేణిలో నిర్వహించిన ఇంటర్నల్ ఎగ్జామ్ ద్వారా జూనియర్ అసిస్టెంట్‌గా పదోన్నతి పొందిన ఉద్యోగులకు జీఎం దేవేందర్ నియామక పత్రాలను అందచేవారు. ఇటీవల నిర్వహించిన వెబ్ కౌన్సెలింగ్ ద్వారా ఏరియాకు వచ్చిన 44 మంది ఉద్యోగుల్లో 43 మంది హాజరయ్యారు. వారికి ఆఫీస్ ఆర్డర్ కాపీలను జీఎం అందచేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో టీబీజీకేఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్‌రావు, ఎస్‌వోటూజీఎం గుప్తా, డీజీఎం ఉజ్వల్‌కుమార్ బెహారా తదితరులు పాల్గొన్నారు.



నియామక పత్రాలు అందిస్తున్న జీఎం దేవేందర్

పూర్తయిన పంటనష్టం సర్వే

- 308 ఎకరాల్లో నష్టం

మంచిర్యాలఅగ్రికల్చర్: జిల్లాలో గత నెలలో అకాల వర్షాలతో నష్టపోయిన పంటలను అధికారులు పూర్తిస్థాయిలో సర్వే చేపట్టి నివేదికను బుధవారం ప్రభుత్వానికి అందజేశారు. గత నెలలో ప్రాథమిక సర్వే చేపట్టిన అధికారులు మరోసారి క్షేత్రస్థాయిలో వ్యవసాయ, విస్తరణ అధికారి (ఏఈవో)తో పాటు, ఉద్యానవన శాఖ, వీఆర్‌ఏ కలిసి దెబ్బతిన్న వివిధ పంట పొలాలను సర్వే చేసి అందుకు అనుగుణంగా గ్రామాల వారీగా రైతుల పేర్లు, ఇతర వివరాలు నమోదు చేశారు. ప్రభుత్వం ఎకరాకు రూ.10వేల చొప్పున ఆర్థిక సాయం ప్రకటించడంతో ప్రభుత్వ గైడ్‌లైన్స్ ప్రకారం గ్రామాల వారీగా సర్వే చేపట్టారు. పంట నష్టం సర్వేలో ఎలాంటి పొరపాట్లు తావు లేకుండా నిర్వహించాలని కలెక్టర్ వ్యవసాయ అధికారులకు సూచించారు. ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా 33 శాతం కన్న ఎక్కువగా నష్టపోయిన పంటలను గుర్తించారు. దండేపల్లి మండలంలోని 8 గ్రామాలు, హాజీపూర్ మండలంలోని నమ్నూర్, మందమర్రి మండలంలోని సారంగపల్లి, జన్నారం మండలంలోని రాంపూర్, తిమ్మపూర్, సింగరాయిపేట, రోటిగూడ గ్రామాలలో వరి, మొక్కజొన్న, మిర్చి, మామిడి పంటలకు నష్టం వాటిల్లినట్లు గుర్తించారు. మొత్తం 13 గ్రామాలలో 297 మంది రైతులకు చెందిన 308 ఎకరాల్లో జరిగిన నష్టాన్ని నమోదు చేసి ప్రభుత్వానికి అందజేశారు. ఈ నష్టానికి ప్రభుత్వం ప్రకటించిన ఎకరానికి రూ. 10వేల చొప్పున మొత్తం రూ. 30లక్షల 80 వేలు రైతులకు అందించాల్సి ఉంది.



దండేపల్లిలో దెబ్బతిన్న మొక్కజొన్న పంట (ఫైల్)

33 శాతంపైన దెబ్బతిన్న పంటలకే..

జిల్లాలో మార్చి 16 నుంచి 21 తేదీలలో వడగళ్ల వర్షం పడింది. ఈ వర్షానికి దండేపల్లి, జన్నారం, హాజీపూర్, మందమర్రి మండలాల్లో వరి, మొక్కజొన్న పంటలు నేలబారాయి, మిర్చి, మామిడి పంటలు కాయాలు నేలరాలాయి. మొక్కజొన్న, వరికి ఎక్కువగా నష్టం వాటిల్లింది.

ఆశాజనకంగా యాసంగి పత్తి

- నీటి వసతి ఉన్న చోట సాగు
- త్వరలో పంట చేతికి

చెన్నూర్‌రూరల్: పత్తి పంటను ఎక్కువగా వానాకాలంలో సాగు చేస్తారు. తొలకరి వర్షాలకు పత్తి విత్తనాలు విత్తుకుంటే దీపావళి వరకు పత్తి పంట చేతికి వస్తుంది. గత ఏడాది నుంచి నీటి సౌకర్యం ఉన్న రైతులు యాసంగిలో రెండవ పంటగా పత్తిని సాగు చేస్తున్నారు. మంచిర్యాల జిల్లా వ్యాప్తంగా సుమారు 20 పైగా గ్రామాలలో రైతులు 163 ఎకరాల్లో పత్తి పంటను సాగు చేస్తున్నారు. వర్షాకాలం సాగులో పత్తి రైతులు అనేక ఇబ్బందులు పడ్డారు. అధిక వర్షాల కారణంగా పత్తి పంటకు చీడ,పీడలు సోకి చాలా నష్ట పోయారు. యాసంగి పత్తికి ఎక్కువగా తెగుళ్ల బెడద తక్కువగా ఉండటం, మంచి దిగుబడి వస్తుండడంతో రైతులు యాసంగిలో పత్తి పంటను సాగు చేస్తున్నారు.

పంట సాగు ప్రారంభం...

నవంబర్, డిసెంబర్ నెలల్లో యాసంగి పత్తి విత్తనాలను విత్తారు. రైతులు యాసంగిలో ఎకరం పత్తి సాగుకు సుమారు రూ.40వేల వరకు పెట్టుబడి పెట్టారు. నీటి వసతి ఉన్న రైతులతో పాటు కొందరు కౌలు రైతులు కూడా యాసంగిలో పత్తి సాగు చేస్తున్నారు. వ్యవసాయాధికారుల సలహాలు, సూచనల మేరకు యాసంగి పత్తిలో చీడ, పీడలకు మందులను పిచికారీ చేస్తున్నారు. ప్రస్తుతం వాతావరణంలో తేమశాతం తక్కువగా ఉండటంతో చీడ, పీడల బెడద తక్కువగా ఉంటుందని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం పత్తి పంటకు పేనుబంక సోకవడంతో వ్యవసాయాధికారుల సూచనల మేరకు నివారణకు మందులు స్ప్రే చేస్తున్నారు. ప్రస్తుతం పత్తి పంటకాయ దశకు చేరుకుంది. ఈ నెల చివరి వారం వరకు పంట చేతికి వస్తుందని రైతులు పేర్కొంటున్నారు. ఎకరాకు సుమారు 10 నుంచి 12క్వింటాళ్ల దిగుబడి వచ్చే అవకాశాలు ఉన్నాయని రైతులు చెబుతున్నారు. వచ్చే యాసంగికి పత్తి సాగు పెరిగే అవకాశాలు ఉన్నాయి.



శివలింగాపూర్ సమీపంలో సాగు చేస్తున్న యాసంగి పత్తి

15ఎకరాల్లో పత్తి సాగు చేశాను..



శివలింగాపూర్ గ్రామం వద్ద 15ఎకరాల్లో యాసంగి పత్తి సాగు చేశాను. వ్యవసాయాధికారుల సూచనల మేరకు చీడ, పీడలను నివారించడం జరుగుతుంది. ప్రస్తుతం పత్తి కాయ దశలో ఉంది. ఈ నెల చివరి వారం లోగా పంట చేతికి వస్తుంది. –రాజేశ్, రైతు

సలహాలు, సూచనలు అందిస్తున్నాం



యాసంగిలో పత్తి పంట సాగు చేసిన రైతులకు సలహాలు, సూచనలు అందిస్తున్నాం. శివలింగాపూర్ వద్ద రైతులు పత్తి పంటను సాగు చేశారు. ప్రస్తుతం పత్తి పంట ఆశాజనకంగా ఉంది.

–రాజశేఖర్, ఏఈవో

నీటి వసతి ఉన్న రైతులు సాగు చేయాలి



నీటి వసతి ఉన్న రైతులు రెండవ పంటగా వరికాకుండా పత్తి పంటను సాగు చేసుకోవచ్చు. యాసంగిలో పత్తికి చీడ పీడలు, తెగుళ్లు ఎక్కువగా సోకవు. యాసంగిలో పత్తి సాగు చేసేందుకు రైతులు ముందుకు రావాలి.

–కవిత, ఏవో, చెన్నూర్